# విధులపై బాధ్యతగా వ్యవహరించాలి

హాజీపూర్, జూన్ 24 : ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు విధులపై బాధ్యతగా వ్యవహరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. హాజీపూర్ తహసీల్, ఎంపీడీవో కార్యాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ ధ్రువ పత్రాల కోసం అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, గడువులోగా జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని కర్ణమామిడి కేజీబీవీని సందర్శించి, వంటశాల, గదులు, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం అందించాలన్నారు. నూతన మెనూ ప్రకారం సకాలంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, శుద్ధమైన నీరు అందించాలని సూచించారు. మూత్రశాలలు, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వాహణపై పకడ్బందీగా చర్యలు


కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

తీసుకోవాలని తెలిపారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సాధించే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

**స్టాప్ డయేరియా పకడ్బందీగా చేపట్టాలి**

మంచిర్యాల అర్బన్/నస్పూర్, జూన్ 24 : జిల్లాలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, డీఆర్డీవో కిషన్‌తో కలిసి సంబంధిత పోస్టర్లను విడుదల చేశారు. జూలై 31వ వరకు చేపట్టిన స్టాప్ డయేరియా జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కల్పన, వైద్యాధికారులు కృపాబాయి, వైద్యులు ప్రసాద్, సుధాకర్ నాయక్, అనిత, కృసాభాయి, అధికారు లు ప్రశాంతి, సురేందర్, నాందేవ్, సంతోష్, పద్మ, వెంకటసాయి, డెమో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**విద్యార్థినికి అభినందనలు**

నస్పూర్, జూన్ 24 : జపాన్ సకురా అంతర్జాతీయ సైన్స్ కార్యక్రమంలో జిల్లా విద్యార్థిని శ్రీవల్లి పాల్గొనడం అభినందనీయమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జాతీయస్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో శ్రీవల్లి అద్భుత ప్రదర్శన చూపి, రాష్ట్రపతి నుంచి ప్రశంస పొందింది. ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు జపాన్‌లో జరిగిన అంతర్జాతీయస్థాయి సైన్స్ కార్యక్రమంలో పాల్గొన్నది. కాగా, కలెక్టరేట్ చాంబర్‌లో డీఈవో యాదయ్య, ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి మధుబాబుతో కలిసి కలెక్టర్ అభినందించారు. అనంతరం ఇన్‌స్పైర్ మానక్ అవార్డు కోసం నామినేషన్ల సంబంధిత పోస్టర్ విడుదల చేశారు. జిల్లాలోని 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న అన్ని పాఠశాలల విద్యార్థుల నుంచి నామినేషన్లు స్వీకరించాలన్నారు.

**బీమా చెక్కుల అందజేత**

స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణ బీమా, ప్రమాద బీమా కింద మృతిచెందిన స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ సంబంధిత చెక్కులను పంపిణీ చేశారు. మొదటి విడుతలో బెల్లంపల్లి మండలంలో ఇద్దరు సభ్యులకు సంబంధించిన చెక్కులు అందించినట్లు తెలిపారు. అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి అంజయ్య, స్త్రీనిధి ఆర్‌ఎం వెంకటరమణ, ఏపీఎం శ్యామల, సీసీ రామకృష్ణ పాల్గొన్నారు.

## కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి

రెబ్బెన, జూన్ 24 : సింగరేణి కార్మికులకు గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏఐటీయూసీ అమలు చేయాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియా వర్క్‌షాప్‌లో మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు పూర్తయి 18 నెలలు గడిచినా హామీలు అమలు చేయడంలేదని ఆరోపించారు. కేసీఆర్ నాయకత్వంలో ఎనలేని హక్కులు సాధించిన ఘనత టీబీజీకేఎస్‌దేనని గుర్తుచేశారు. ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, వర్క్‌షాప్ పిట్ కార్యదర్శి గాజవేణి శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు దారవత్ మంగీలాల్, సెంట్రల్ కమిటీ జాయింట్ సెక్రటరి పానగంటి సత్తయ్య, సెంట్రల్ కమిటీ సభ్యుడు ఓరం కిరణ్, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, ఖైర్‌గూడ పిట్ కార్యదర్శి బొంగు వెంకటేశ్, స్టోర్స్ పిట్ కార్యదర్శి గణపతి, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సురేశ్, సీనియర్ నాయకులు ముల్కల చంద్రయ్య, కమిటీ సభ్యులు వైకుంఠం, హరిసింగ్, వెంకటస్వామి, రమేశ్, కనకయ్య, చంద్రయ్య, సంజీవ్ ఉన్నారు.

**ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లను నియమించద్దు**

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి వర్క్‌షాప్‌లో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లను నియమించవద్దని టీబీజీకేఎస్ వర్క్‌షాప్ పిట్ కార్యదర్శి గాజవేణి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌లో మంగళవారం డీజీఎం(వర్క్‌షాప్) కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. సింగరేణిలో అనుభవం ఉన్న ఎంతో మంది టెక్నీషియన్లు ఉన్నారని, కొత్తగా నియమించిన బదిలీ వర్కర్, ఇతర డిసిగ్నేషన్లలో ఎంతో మంది అప్రెంటిస్ పూర్తి చేసి ఉన్నారని అన్నారు. సింగరేణి పర్మినెంట్ ఉద్యోగులను నియమించాలని సూచించారు. కాంట్రాక్టు వారిని నియమించడాన్ని టీబీజీకేఎస్ వ్యతిరేకిస్తుందన్నారు. కమిటీ సభ్యులు రమేశ్, సంజీవ్, నాయకులు ముల్కల్ల చంద్రయ్య, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పర్సనల్ హెచ్‌వోడీకి సన్మానం


రాజేశ్వర్‌రావును సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రెబ్బెన, జూన్ 24 : బెల్లంపల్లి ఏరియాకు కొత్తగా వచ్చిన పర్సనల్ హెచ్‌వోడీ రాజేశ్వర్‌రావును టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి, శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువ కప్పి, ఘనంగా సన్మానించారు. అనంతరం ఏరియాకు సంబంధించిన పలు విషయాలు చర్చించుకున్నారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, జీఎం కార్యాలయ పిట్ కార్యదర్శి గడ్డం రవీందర్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి మంకయ్య, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, సెంట్రల్ కమిటీ జాయింట్ సెక్రటరి ఓరం కిరణ్, ఖైర్‌గూడ పిట్ కార్యదర్శి బొంగు వెంకటేశ్, నాయకులు సంజీవ్, కలీముల్లాఖాన్ పాల్గొన్నారు.

## షోకాజ్ నోటీసులు

దండేపల్లి, జూన్ 24 : దండేపల్లి కేజీబీవీలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసిన ఘటనలో విద్యాలయ ప్రత్యేకాధికారి మంజులతో పాటు, డే వాచ్ ఉమెన్ నీల, అసిస్టెంట్ కుకింగ్ హెల్పర్ భారతి, స్వీపర్ లచ్చవ్వకు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంఈవో దుర్గం చిన్నయ్య తెలిపారు. షోకాజ్ నోటీసుల విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

## అభివృద్ధి కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్/నస్పూర్, జూన్ 24 : ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి మంగళవారం సీసీఎల్‌ఏ కమిషనర్ లోకేశ్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టియాన, వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్ రావు, గృహ నిర్మాణ శాఖ ఎండీ వీపీ గౌతం, అటవీ అధికారులతో కలిసి పలు అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మాట్లాడారు. జిల్లాలోని మొదటి విడుతగా 5,598 ఇందిరమ్మ ఇండ్లు మంజూరవగా, 1,500 నిర్మాణాలు ప్రారంభమయ్యాయని వివరించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వివిధ సమస్యలపై 4,111 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇక్కడ అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, ఎం డేవిడ్, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, డీఆర్డీవో దత్తారావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, వ్యవసాయ శాఖ అధికారులు, గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. మంచిర్యాల నుంచి కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచితంగా ఇసుక అందిస్తున్నామని తెలిపారు. భూభారతి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక్కడ అధికారులు శివ్‌ఆశిష్‌సింగ్, హరీశ్‌రాజ్, కిషన్, కల్పన, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి

మందమర్రి, జూన్ 24 : సోషల్ మీడియా వేదికగా విలేకరులను హేలన చేస్తూ పోస్టులు పెట్టిన కాంగ్రెస్ నాయకుడు పైడిమల్ల నర్సింగ్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జే రవీందర్ డిమాండ్ చేశారు. మందమర్రి పట్టణంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి, రాజకీయ నాయకులకు, ప్రజలకు వారధిగా నిలుస్తున్న విలేకరులను అవహేలన చేయడం సరికాదన్నారు. విలేకరులు ఉంటేనే సమాజంలోని రుగ్మతలు వెలుగులోకి వస్తాయని, రాజకీయ నాయకుడి గుణగణాలు, ఎదుగుదల వారు రాసే వార్తల పైనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థపై తమకు నమ్మకం ఉందని, పట్టణంలోని విలేకరులు మూకుమ్మడిగా స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టక పోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంలో మంత్రి వివేక్ ప్రత్యేక చొరవ తీసుకొని, ఆ నాయకుడిని పార్టీ నుంచి బహిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, ఓ రాజశేఖర్, బండారు సూరిబాబు, కొంగల తిరుపతి రెడ్డి, ఎండీ అబ్బాస్, బోరిగం వెంకటేశ్, మద్ది శంకర్, బర్ల సదానందం, మేడిపల్లి మల్లేశ్, తోట సురేందర్, శ్రీకాంత్, భూపెల్లి కనకయ్య, పల్లె నర్సింగ్, పూసాల ఓదెలు, సీసెల్లి సాగర్, బెల్లం అశోక్, ముస్తఫా, మొగురం శ్రీనివాస్, కటికె రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

**నల్ల బ్యాడ్జీలతో విలేకరుల నిరసన..**

కాంగ్రెస్ నాయకుడిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మందమర్రి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ ఎదుట విలేకరులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గాండ్ల సంజీవ్ మాట్లాడుతూ.. విలేకరులపై కొందరు నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

## శ్రీరాంపూర్ ఓసీపీ పీవో, మేనేజర్‌కు సన్మానం

శ్రీరాంపూర్, జూన్ 24 : శ్రీరాంపూర్ ఓసీపీ-2 ప్రాజెక్టు ఆఫీసర్(పీవో) వెంకటేశ్వర్లు, మేనేజర్ ఐలి శ్రీనివాస్‌ను మంగళవారం టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేశ్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, పిట్ కార్యదర్శి గడ్డం సుధాకర్ మర్యాద పూర్వకంగా కలిసి, సన్మానించారు. అనంతరం టీబీజీకేఎస్ పిట్ కమిటీ నాయకులను పరిచయం చేశారు. కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి, కేంద్ర నాయకులు గడ్డం మహిపాల్‌రెడ్డి, ఆంజనేయులు, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి జంగా రమేశ్, బుర్ర శ్రీనివాస్, సత్యనారాయణ, సంపత్, క్రాంతి, తిరుపతి, స్రవంతి, హెమలత పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రి, జూన్ 24 : సీసీసీ నస్పూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరం ఫస్టియర్‌లో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కొత్తగూడెం ఎడ్యుకేషనల్ సొసైటీ నుంచి నోటిఫికేషన్ విడుదలైనట్లు పేర్కొన్నారు. సివిల్ కోర్సులో 60, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్‌లో 60, మెకానికల్ 60, మైనింగ్ 60 మొత్తం 300 సీట్లు ఉన్నాయని వివరించారు. ఇందులో 150 సీట్లను సింగరేణి ఉద్యోగుల పిల్లలకు, మిగతావి ఇతరులకు కేటాయించనున్నట్లు తెలిపారు. సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలు జూలై 3వ తేదీలోగా (https://scp.scpolythnic.com/online admission), ఇతర విద్యార్థులు 24 నుంచి 28వ తేదీలోపు (https://tgpolycet.nic.in) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 90102 22161, 94911 44168 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## ఏటీఎం చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

బెల్లంపల్లి, జూన్ 24 : బెల్లంపలి పట్టణంలోని కాల్‌టెక్స్ ఎస్బీఐ ఏటీఎంలో దొంగతనం కేసును పోలీసులు 24 గంటల్లో చేదించారు. ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. బెల్లంపల్లి రూరల్ సీఐ కార్యాలయంలో మంగళవారం మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున టూ టౌన్ పోలీసులు కాల్‌టెక్స్ ప్రధాన రహదారిపై పెట్రోలింగ్ చేస్తుండగా, ఏటీఎం కేంద్రం ఎదుట రెండు నిలిపి ఉన్నాయి. అలాగే కేంద్రం స్వెట్టర్ మూసి ఉంది. అనుమానంతో పోలీసులు బైక్‌ల సైలెన్సర్లు పరిశీలించగా, వేడిగా ఉన్నాయి. దీంతో స్వెట్టర్ పైకి లేపేందుకు ప్రయత్నించగా, దొంగలు పారిపోయారు. ఏటీఎం కేంద్రం సీఎంఎస్ కంపెనీకి చెందిన అసిస్టెంట్ మేనేజర్ శివకుమార్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో దొంగతనంపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాలతో నాలుగు బృందాలతో విస్తృతంగా గాలింపు చేపట్టారు. మంగళవారం ఉదయం కెమికల్ ఏరియాలో దొంగతనానికి పాల్పడిన ముస్తఫా, షాషిద్‌ను అరెస్ట్ చేశారు. తమదైన శైలిలో విచారించగా, మొత్తంగా ఐదుగురు దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించారు. హర్యానా రాష్ట్రానికి చెందిన ముస్తఫా, షాషిద్ జేసీబీ ఆపరేటర్లుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో అలీమ్‌ఖాన్, సాజిద్, అఫ్తాబ్‌తో కలిసి బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలోని ఏటీఎం వద్ద రెక్కీ నిర్వహించి, దొంగతనానికి పాల్పడ్డారు. ముస్తఫా, షాషిద్‌ను అరెస్ట్ చేశామని, అలీమ్‌ఖాన్, సాజిద్, అఫ్తాబ్ కోసం గాలిస్తున్నామని డీసీపీ వెల్లడించారు. రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్, నెన్నెల ఎస్‌ఐలు మహేందర్, ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుల్ సాయికృష్ణ, హోంగార్డు సంపత్‌ను డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

## యువకుడి ఆత్మహత్యాయత్నం

పెంచికల్‌పేట్, జూన్ 24 : మనస్థాపానికి గురై ఓ యువకుడు పురుగుల మందు తాగిన ఘటన పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అగర్‌గూడకు చెందిన తుమ్మిడే రాజశేఖర్ మండల కేంద్రంలోని రాచకొండ కృష్ణకు చెందిన ఫెర్టిలైజర్ దుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. ఇటీవల తన అవసరాలకు షాపు నుంచి రూ.10 వేలు అప్పుగా తీసుకున్నాడు. వ్యక్తిగత పని ఉండడంతో కొద్ది రోజులు షాపునకు రాలేదు. తిరిగి రాగా, సోమవారం రాజశేఖర్‌ను యజమాని అడుగగా, రాజశేఖర్ తిరిగి ఇచ్చాడు. పనికి సరిగా రాకుండా డబ్బు తీసుకుంటే ఎలా అంటూ పలువరి ఎదుటే రాజశేఖర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో మనస్తాపం చెందిన యువకుడు షాపు నుంచి బయటకు వెళ్లాడు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో అగర్‌గూడ వెళ్లే దారిలో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి, వెంటనే దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న రాజశేఖర్ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు మంగళవారం ఫెర్టిలైజర్ దుకాణా యజమాని కృష్ణ ఇంటి ముందు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ సీఐ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

## విద్యార్థి ఆత్మహత్య

దండేపల్లి, జూన్ 24 : దండేపల్లి మండల కేంద్రానికి చెందిన ఇంటర్ విద్యార్థి పొన్నం తరుణ్‌గౌడ్(18) మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ తహసినుద్దీన్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటర్ పూర్తయ్యాక బీటెక్ చేయాలని తరుణ్‌కు కుటుంబ సభ్యులు చెప్పారు. తనకు చదువుపై శ్రద్ధలేదని, ఏదైనా వ్యాపారం చేసుకుంటానని తరుణ్‌గౌడ్ అన్నాడు. దానికి తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. ఉన్నత చదువులు పూర్తయిన తర్వాత ఇష్టమైన వ్యాపారం చేసుకోమని చెప్పి, హైదరాబాద్ వెళ్లి బీటెక్ కాలేజీలు చూసి వచ్చారు. అప్పటి నుంచి తరుణ్ కుటుంబ సభ్యులతో చిరాకుపడడం, తల్లిని తరుచూ కోపగించుకునేవాడు. కుటుంబ సభ్యులు ఎంత నచ్చజెప్పినా వినేవాడు కాదు. మనస్థాపం చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. తండ్రి పొన్నం చంద్రాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## అసంబద్ధ ఉత్తర్వులు విరమించుకోవాలి

నస్పూర్, జూన్ 24 : పాఠశాలల తనిఖీ కోసం ఉపాధ్యాయులను వినియోగించాలనే అసంబద్ధమైన ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రాసపల్లి రవి, ప్రధాన కార్యదర్శి తిరుపతి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతీ మండలానికి ఇద్దరు ఎంఈవోలను నియమించి, ఒకరు పాలనాపరమైన బాధ్యతలు చూస్తే, మరొకరు పాఠశాల పర్యవేక్షణ కోసం పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేయాలని కోరారు.

## 'రైతులకు బేడీలు వేసినందుకా సంబురాలు'

బెల్లంపల్లి/తాండూర్, జూన్ 24 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు బేడీలు వేసినందుకు రైతు భరోసా పథకం కింద విజయోత్సవ సంబురాలు చేసుకుంటున్నారా..? అని బీఆర్‌ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా విజయోత్సవ సభపై ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. సన్న వడ్లకు బోనస్ ఇవ్వనందుకా.., రెండుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టినందుకా.., రైతులకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి, రూ.12 వేలే ఇస్తున్నాందుకా..? ఈ సంబురాలు అని ధ్వజమెత్తారు. కేవలం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టేందుకేనని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేస్తే, కాంగ్రెస్ హయాంలో కేవలం 60 శాతం మందికి కూడా మాఫీ కాలేదని ఆరోపించారు.

## బడి బాగుకు ఒక్కటయ్యారు

దండేపల్లి, జూన్ 24 : తమకు విద్యాబుద్ధులు నేర్పి బతుకుదారి చూపించిన బడి కోసం పూర్వ విద్యార్థులు నడుంబిగించారు. ఉనికి కోల్పోతున్న చదువుల చెట్టుకు పూర్వ వైభవం తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. వివరాల్లోకి వెళితే దండేపల్లి మండలం తాళ్లపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధాన గేటు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. ఆవరణలోకి పశువులు వచ్చి, అస్తవ్యస్తంగా తయారవుతున్నది. విషయం తెలుసుకున్న 2007-08 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.22వేలతో గేటు ఏర్పాటు చేయించారు. అలాగే ప్రాథమిక పాఠశాలలోని ఓ గదిలో ఫ్లోరింగ్ సమస్య ఉందని తెలుసుకొని, స్థానిక శివగణేశ్ యూత్ సభ్యులు రఊ.8వేలతో ఫ్లోరింగ్ చేయించారు.

## 102 గిరిజన గ్రామాల్లో జుగా అమలు

తిర్యాణి, జూన్ 24 : జిల్లాలోని 102 గిరిజన గ్రామాల్లో పీఎం జుగా పథకం అమలుపర్చనున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెడ్మ యశ్వంత్ రావు, ఏటీడీవో చిరంజీవి తెలిపారు. మండలంలోని సుంగాపూర్, మోయిందా, గుడిపేట్, కన్నెపల్లి గ్రామాల్లో మంగళవారం గిరిజనులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో వేముల మల్లేశ్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, పశువైద్యాధికారి సాగర్, పీఎఫ్ఎల్ కోఆర్డినేటర్లు శ్రీకాంత్ గౌడ్, వనిజరాణి, అగాఖాన్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ కిరణ్ గిరిజనులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్లుగా పోస్టింగ్‌లు

మంచిర్యాలటౌన్, జూన్ 24 : ఇప్పటికే ఉద్యోగోన్నతి పొందిన ఇద్దరు మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులకు అసిస్టెంట్ కమిషనర్లుగా పోస్టింగ్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం వెలువరించింది. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ సూపర్‌వైజర్ రాజమనోహర్, మున్సిపల్ మేనేజర్ కే విజయ్‌కుమార్‌కు గ్రేడ్ 3 కమిషర్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. రాజమనోహర్‌కు ఇక్కడ, విజయ్‌కుమార్‌కు ఆదిలాబాద్‌లో పోస్టింగ్ ఇచ్చారు.

## కమిషనర్ల నియామకం

చెన్నూర్, జూన్ 24 : చెన్నూర్ మున్సిపల్ కమిషనర్‌గా అంజయ్యను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. కాగజ్‌నగర్ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. ప్రస్తుతం మురళీకృష్ణ డిప్యూటేషన్‌పై కమిషనర్‌గా పని చేస్తున్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 24 : ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా గజానంద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఆర్వోగా విధులు నిర్వహిస్తున్న భుజంగ్‌రావు ఆసిఫాబాద్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఇన్నాళ్లు కొనసాగారు.

## అధికారులు భాగస్వామ్యం కావాలి

కాసిపేట, జూన్ 24 : వంద శాతం అక్షరాస్యత కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు భాగస్వామ్యం కావాలని మండల ప్రత్యేకాధికారి పురుషోత్తం నాయక్ సూచించారు. జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్షరాస్యత కార్యక్రమంపై ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పలు శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 28న ముత్యంపల్లి, ధర్మారావుపేట రైతు వేదికల్లో వయోజనులకు పరీక్షలు, మూల్యాంకణ ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ భోజన్న, ఎంపీవో షేక్ సప్దర్ అలీ, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, ఏపీఎం వెంకటేశం, డీఆర్పీలు కొండు జనార్దన్, బండ శాంకరి, కార్యదర్శులు, వలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

## మారు పేర్లు, విజిలెన్స్ కేసులు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, జూన్ 24 : సింగరేణిలో మారుపేర్లతో పనిచేస్తున్న, మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికుల పిల్లలకు వెంటనే విజిలెన్స్ వేదింపులు మానుకోని కారుణ్య ఉద్యోగాలు కల్పించాలని సింగరేణి మారుపేర్ల బాధిత కార్మికుల పిల్లలు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధిత కార్మికుల పిల్లలు లక్క శ్రావణ్, వంగ సంతోష్, ఈర్ల రాజయ్య మాట్లాడారు. ఆరేళ్లుగా తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నామన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నాయకులు సింగరేణి స్ట్రక్చర్ సమావేశంలో ఈ సమస్యను చేర్చి చర్చించాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం హెడ్డాఫీస్ ఎదుట 27న బాధిత యువకుల ఆధ్వర్యంలో చేపట్టే మహాధర్నా, నిరసన కార్యక్రమానికి అన్ని కార్మిక సంఘాల ప్రతినిధులు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు పొన్నం వెంకటేశ్, ప్రవీణ్, సుధాకర్, శ్రావణ్, పార్థపల్లి హరి, కొమురమ్మ, సంకీర్త్ పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన

సీసీసీ నస్పూర్, జూన్ 24 : నస్పూర్ పట్టణంలోని తీగల్‌పహాడ్ జడ్పీ పాఠశాలలో సీసీసీ నస్పూర్ ఎస్‌ఐ ఉపేందర్‌రావు మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హాజీపూర్, జూన్ 24 దొనబండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఐ స్వరూప్ రాజ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్లోగన్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం హన్మండ్లు, ఆర్ట్ టీచర్ మూర్తి, ఉపాధ్యాయులు, హెడ్ కానిస్టేబుల్ రవీంద్ర కులకర్ణి, కానిస్టేబుల్ పెట్టెం రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహా రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు, స్థానికులు

కాసిపేట, జూన్ 24 : కాసిపేట మండలం దేవాపూర్ కాలనీలోని లేడీస్ క్లబ్ ఆవరణలో ఓరియంట్(అదానీ) సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన మహా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో కంపెనీ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరాన్ని యూనిట్ హెడ్ బాల గిరిధర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఉద్యోగులు, స్థానికులు భారీగా తరలివచ్చి రక్తదానం చేశారు. సాయంత్రం వరకు 366 మంది రక్తదానం చేశారు. దాతలకు ఓరియంట్(అదానీ) కంపెనీ, రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి ప్రశంసా ప్రత్రాలు అధికారులు అందించారు. హెచ్‌ఆర్ జీఎం కులకర్ణి, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, సెక్రటరీ చందూరి మహేందర్, అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల డబ్బు పక్కదారిపై విచారణ

జైపూర్, జూన్ 24 : జైపూర్ మండలం కుందారం గ్రామంలోని ఓ మహిళా సంఘానికి చెందిన రూ.6.25 లక్షలు దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలపై అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాలుగు సంఘాలకు చెందిన రూ.6.25 లక్షలతో పాటు, మరో సంఘం నుంచి సభ్యుల అనుమతితో తీసుకున్న రూ.2.5 లక్షలను గ్రామానికి చెందిన మౌనిక అనే వీఏవో సొంతానికి వాడుకున్నట్లు తేలింది. దీంతో రెండు నెలలలో చెల్లించేందుకు అంగీకార పత్రం రాయించినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## డయల్ యువర్ డీఎంకు స్పందన

మంచిర్యాలటౌన్, జూన్ 24 : ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు మంగళవారం మంచిర్యాల ఆర్టీసీ డీఎం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన లభించింది. బెల్లంపల్లి రూట్‌లో ఏరియా దవాఖాన, ఏఎంసీ వద్ద బస్సులు ఆపడం లేదని సలీం.., చెన్నూర్ నుంచి కాళేశ్వరం వెళ్లే రూట్‌లో రాంపూర్, లక్ష్మీపూర్ స్టేజీలలో రిక్వెస్ట్ స్టాప్‌లను ఏర్పాటుచేసి, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగేలా చూడాలని కొందరు కోరారు. వీటిపై చర్యలు తీసుకుంటానని డీఎం హామీ ఇచ్చారు.

## బోరుకు చేతిపంపు ఏర్పాటు

తాండూర్, జూన్ 24 : పోచమ్మ ఆలయానికి వస్తున్న భక్తులకు నీటి ఇబ్బందులు తీర్చేందుకు మాజీ ఎంపీటీసీ సూరం రవీందర్‌రెడ్డి రెండు నెలల క్రితం స్థానిక నాయకులతో కలిసి నూతన బోరు వేయించారు. దానికి మంగళవారం చేతిపంపు ఏర్పాటుచేసి, ప్రారంభించారు. శ్రీనివాస్, పర్బత్‌రావు, మాణిక్‌రావు, అమృత్‌రావు, శంకరయ్య, రమేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన పద్ధతుల ద్వారా బోధించాలి

కౌటాల, జూన్ 24 : కౌటాల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నూతన పద్ధతుల ద్వారా విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు ఎంఈవో గావుడే హన్మంతు సూచించారు. మండలంలోని ముత్తంపేట బారేవాడ, గురుడుపేట ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఆయన వెంట సీఆర్పీ దేవన్న ఉన్నారు.

## శంకరమ్మకు కోవ లక్ష్మి సన్మానం


కుందారపు శంకరమ్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, జూన్ 24 : రెబ్బెన మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సీనియర్ మహిళా నాయకురాలు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మను మంగళవారం జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సన్మానించారు. మున్నూరు కాపు సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యేను ఆమె మర్యాదపూర్వకంగా వెళ్లి, కలిశారు.

**మాజీ ఎంపీటీసీకి పరామర్శ**

కెరమెరి, జూన్ 24 : మండల కేంద్రంలోని కెరమెరి-1 మాజీ ఎంపీటీసీ ఇఫ్తెకర్ దేశముఖ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతుండగా, బీఆర్‌ఎస్ నాయకులతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న ఆమె, వెంటనే వారి నివాసానికి వెళ్లి, యోగక్షేమాలపై ఆరాతీశారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమె వెంట మండల మాజీ ప్రజాప్రతినిధులు పెందోర్ మోతీరాం, సయ్యద్ అబూల్ కలాం, సెడ్మాకి దుర్పతాబాయి, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## సహకార సంఘాల ఎన్నికల కార్యాచరణ ఖరారు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 24 : సహకార సంఘాల ఎన్నికల కార్యాచరణ ఖరారైందని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సహకార అధికారి, ఎన్నికల అధికారి బీ మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన ప్రాథమిక సహకార మార్కెటింగ్ సంఘం లిమిటెడ్‌లోని ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి స్థానాలకు రహస్య బ్యాలెట్ పద్ధతిన జూలై 9వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 28, 30, జూలై 1 తేదీల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఆసిఫాబాద్ పట్టణంలోని గిరిజన ప్రాథమిక సహకార మార్కెటింగ్ సంఘం లిమిటెడ్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయవచ్చని వివరించారు. జూలై 2 ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు పరిశీలించి, 3 గంటల తర్వాత జాబితా ప్రకటించనున్నట్లు వెల్లడించారు. జూలై 3 ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చని, అదే రోజు సాయంత్రం 3 గంటల తరువాత తుది జాబితా, 5 గంటల తరువాత ఎన్నికల చిహ్నాలు కేటాయించనున్నట్లు తెలిపారు.

## కఠినంగా శిక్షించాలి

వాంకిడి, జూన్ 24 : వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామంలో, ఖమ్మం జిల్లా వైరా మండలం సిరిపురం గ్రామంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ సంఘం, సిద్ధార్థ యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో మంగళవారం వారు మాట్లాడారు. బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్, మండలాధ్యక్షుడు దుర్గం దుర్గాజీ, ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రే, సమతా సైనిక దళ్ జిల్లా బాధ్యులు దుర్గం సందీప్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రోషన్ ఉప్రే, సిద్ధార్థ యువజన సంఘం నాయకులు దుర్గం మనోజ్, రాకేశ్, జాడే మారుతి, శివాజీ, మోను, నూతన్ ప్రసాద్, స్వాగత్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**CHANGE OF NAME**
I,Thota Janardhan Rajam (Old Name) R/o.H.No.21-312/3, Thirumalagiri Colony, Mancherial Village, Dist.Mancherial, Telangana-504208. I have changed my name to THOTA JANARDHAN S/o.THOTA RAJAM (New name) For all Purposes.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677